క్లుప్తంగా

ఆర్థికసాయం



మృతురాలి కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

కేశంపేట: మండల కేంద్రానికి చెందిన లిక్కీ శంకరయ్య అకస్మాత్తుగా మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, గ్రామానికి చెందిన గంద్రాతి రమణయ్యగౌడ్‌లు రూ.5వేల చొప్పున, తలసాని పవన్‌కుమార్‌రెడ్డి రూ.3వేల ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు అనసూయ, శ్రీశైలం, నవీన్, జంగయ్య, మల్లేశ్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై సమీక్ష



సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్

చేవెళ్ల: రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర కులగణనకు సంబంధించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొన్నారు. మంగళవారం నగరంలోని బోయిన్‌పల్లిలో సమగ్ర కులగణన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సోలీపూర్ గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తద్వారా గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు సత్తా చాటాలని సూచించారు. ఈ సందర్భంగా బూర్గుల గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మిద్దె గణేష్, మోహన్ సింగ్, చేగు సుధాకర్, మహేందర్‌రెడ్డి, కొముర‌య్య, లక్ష్మణచారి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్‌లోని వీరాంజనేయస్వామి దేవాలయం ఆధునీకరణ కోసం రూ.9లక్షల విలువ చేసే వనరులను ఆయన సమకూర్చారు. ఈ సందర్భంగా ఈనెల 18న దేవాలయంలో జరిగే విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని, భక్తితోనే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ యాదవ్, శేఖర్, శివ పాల్గొన్నారు.

విద్య శక్తివంతమైన ఆయుధం

శంకర్‌పల్లి: ప్రపంచంలో విద్య కంటే గొప్ప ఆయుధం ఏదీలేదని ఎంజీఐటీ(మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మహారాజ్‌పేట గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వారంరోజుల పాటు స్పెషల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. మంగళవారం కళాశాల విద్యార్థులు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ బాల్‌రెడ్డి, హెచ్ఓడీ రవిచందర్, కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కుసుమ సాగు.. లాభాలు బాగు!

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- మార్కెట్‌లో అధిక డిమాండ్



తాళ్లపల్లిలో రైతులు సాగుచేసిన తెల్లకుసుమ పంట

షాబాద్: కుసుమ సాగు రైతులకు లాభాలను తెచ్చిపెడుతుంది. మార్కెట్‌లో నూనె ధరలు అధికంగా పెరగడంతో రైతులు తెల్ల కుసుమ పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ సంవత్సరం జిల్లాలో ఎక్కువ మంది రైతులు, తెల్లకుసుమ, నల్ల కుసుమ పంటలను సాగు చేస్తున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలైన తెల్లకుసుమ సాగు విస్తీర్ణం గతంలో కంటే ఇప్పుడు పెరుగుతుంది. రబీలో సాగు చేసే కుసుమ పంటల సాగు పట్ల రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రోత్సాహం కరువు..

రబీలో పండించే నూనెగింజలలో ప్రధానమైనది తెల్లకుసుమ పంట. దశాబ్దం క్రితం వరకు రైతులు వేల ఎకరాల్లో తెల్లకుసుమ సాగు చేసేవారు. ఏ ఇంట చూసినా తెల్లకుసుమలను గాను గాడించి ఏడాది పాటు అవసరమైన వంటనూనెను నిల్వ చేసుకునే వారు. తెల్లకుసుమ పంట సాగు తగ్గిపోవడంతో పరిస్థితులలో మార్పులు చోటుచేసుకున్నాయి. రబీలో నల్లరేగడి నేలల్లో పూర్తిగా లేదా అంతర పంటగా తెల్లకుసుమ సాగు చేసేవారు. కానీ మండలంలో పత్తిసాగు పెరగడం తెల్లకుసుమకు శాపంగా మారింది. పత్తి పంటను ఖరీఫ్‌లో సాగు చేసినప్పటికీ రబీ పంట కాలం ముగిసేవరకు దిగుబడులను ఇస్తుంది. దీంతో రబీసాగుకు అవరోధం ఏర్పడుతోంది. పత్తి సాగుతో ముఖ్యంగా మండల ప్రజల ఆహార పంట అయిన తెల్లజొన్న, శనగ సాగును తీవ్రంగా దెబ్బతీసింది. అదే సమయంలో జొన్న, శనగలో అంతర పంటగా సాగుచేసే కుసుమపంట సాగును ప్రభావితం చేసింది. దశాబ్దం క్రితం వరకు వేల ఎకరాల్లో సాగుచేసే తెల్లకుసుమ పంట వందల్లోకి పడిపోయింది. ప్రస్తుతం మండలంలో సుమారు 2,584 నుంచి 38,521 ఎకరాల్లో తెల్లకుసుమ సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

రికార్డుస్థాయిలో తెల్లకుసుమ ధరలు..

తెల్లకుసుమ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం లభించడం లేదు. సర్దార్‌నగర్, చేవెళ్ల మార్కెట్లో తెల్లకుసుమ విత్తనాలు లభించడం లేదు. రైతులు తమ వద్ద నిల్వచేసి భద్రపరుచుకున్న విత్తనాలను మాత్రమే విత్తుకోవాల్సి వస్తోంది. సాగు విస్తీరణం తగ్గిపోవడంతో తెల్లకుసుమ రేట్లు రికార్డుస్థాయిలో గణనీయంగా పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో తెల్ల కుసుమలు క్వింటాల్‌కు రూ.8వేలు పలుకుతోంది. తెల్ల కుసుమలను కొని మరాడించి తీసిన నూనె కిలో రూ.మూడు వందలు పలుకుతోంది. గాను గాడించి తీసిన, ఆరోగ్యానికి ఎంతో మేలైన మంచి కుసుమ నూనె కొందామన్నా మార్కెట్లో లభించడం లేదు. మిల్లులో లేదా రైతుల వద్ద కొనుగోలు చేయాల్సి వస్తోంది. వారి వద్ద సైతం డిమాండ్ మేరకు లభించడంలేదు. ఆరోగ్యానికి ఎంతో మేలైన తెల్లకుసుమ సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నాలుగెకరాల్లో సాగుచేశా



ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో తెల్ల కుసుమ పంటను సాగు చేశాను. గతంలో వరి పంట సాగుచేసే వాళ్లం. ప్రభుత్వం వరి పంటకు బదులు ఆరుతడి పంటలు సాగు చేసుకోమడంతో ఈ పంటను వేశాను. గతంలో ఏడాది పొడవునా తెల్లకుసుమ నూనె వాడేవాళ్లం. మళ్లీ అదే పంటలను సాగు చేస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్లో తెల్ల కుసుమ నూనెకు మంచి డిమాండ్ ఉంది.

– దండు యాదవరెడ్డి, రైతు, బొబ్బిలిగామ

ఆసక్తి చూపుతున్నారు



నూనె గింజల సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత 30 ఏళ్ల క్రితం ఎక్కువగా రబీ సీజన్‌లో తెల్ల కుసుమ, నల్ల కుసుమ పంటలను వేసేవారు. ఇప్పుడు పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేయడంతో మార్కెట్‌లో నూనెల ధరలు పెరుగుతున్నాయి. అందుకే నూనె గింజల సాగు చేసేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు.

– అంజయ్య, రైతు, మక్తగూడ

సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఆయాలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఇటీవల సీడీపీఓ నాగమణి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంగన్‌వాడీ ఆయాలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై అంగన్‌వాడీ ఆయాలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని పెంపొందించుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ అలీఖాన్ బాబర్, రఘునాయక్, బసవేశ్వర్, ఇబ్రహీం, అన్వర్, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, దామోదర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సాయి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అండాలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌ను వినియోగంలోకి తీసుకొస్తాం

చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్



రైతు బజార్‌ను చదును చేయిస్తున్న పెంటయ్యగౌడ్ తదితరులు

చేవెళ్ల: రైతులకు, వినియోగదారులకు ఉపయోగకరంగా ఉండేలా చేవెళ్ల రైతుబజార్‌ను వినియోగంలోకి తీసుకొస్తామని చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.పెంటయ్యగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే దారిలో మార్కెట్ నిధులతో నిర్మించిన రైతుబజార్‌ను ఉపయోగించుకోకపోవటంతో నిరుపయోగంగా ఉంది. మంగళవారం నూతన పాలకవర్గ సభ్యులు ఈ రైతుబజార్‌లో ఉన్న చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించి చదును చేసే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు మాట్లాడుతూ.. గతంలో పలువురు నాయకులు ఈ సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారన్నారు. అప్పుడే ఈ రైతు బజారును ఉపయోగంలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చామని, ఇందులో భాగంగానే రైతు బజారును సందర్శించి శుభ్రం చేయిస్తున్నట్లు చెప్పారు. రోడ్లపక్కన కూరగాయలు విక్రయిస్తున్న వారిని రైతుబజారులోకి మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే కూరగాయలు అమ్మే చిరువ్యాపారులతో, రైతులతో మాట్లాడతామన్నారు. కూరగాయలు, పండ్లు అన్ని ఒకేచోట ఉండేలా రైతు బజార్‌ను అభివృద్ధి చేస్తామని, దీనికి మండల ప్రజలు, అన్ని పార్టీల నాయకుల సహకారం ఉండాలని కోరారు. రైతులకు అందుబాటులో ఉంటూ మార్కెట్‌ను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని చెప్పారు. వారి వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మల్లేశ్, నరేందర్, నాయకులు ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

హామీల అమలుకు కృషి చేద్దాం

ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ వెంకట్రామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

షాద్‌నగర్: ఉద్యమకారుల కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఉద్యమకారుల సంక్షేమ సంఘం షాద్‌నగర్ తాలుకా చైర్మన్ వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో షాద్‌నగర్ నియోజకవర్గస్థాయి ఉద్యమకారుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఉద్యమకారులకు తగిన గుర్తింపు ఇస్తామని హామీనిచ్చారన్నారు. హామీలను సాధించుకునేందుకు ఉద్యమకారులందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షులుగా పినబాక ప్రభాకర్, మిట్టునాయక్, వైస్ చైర్మన్లుగా అర్ల యాదయ్య, జాంగారి రవి, సిద్దెల శ్రీనాథ్, కన్వీనర్లుగా నక్కల వెంకటేశ్‌గౌడ్, మన్నె నారాయణ, నర్సింలు, వెంకటేశ్‌యాదవ్, కోకన్వీనర్లుగా సిరాజుద్దీన్, జాంగారి నర్సింలు, బాల్‌రాజ్, కో–ఆర్డినేటర్లుగా దిలీప్‌కుమార్, శరత్‌కృష్ణ, పాండురంగారెడ్డి, సలహాదారులుగా క్లెం నర్సింహారెడ్డి, రాంబల్‌నాయక్, మంగులాల్‌నాయక్, ఎమ్మె సత్తయ్య, లంకాల సురేశ్‌రెడ్డి, కమ్మరి భూపాల్‌చారి, రాజ్యలక్ష్మిలను ఎన్నుకున్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



మేడిపల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ అహ్మద్

మొయినాబాద్: పాడి రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని మేడిపల్లిలో మంగళవారం 261 పాడి పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ మార్పులను బట్టి పశువులకు చాలారకాల రోగాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వాటి నుంచి రక్షించుకోవడానికి ముందు జాగ్రత్తగా నివారణ చర్యలు పాటించాలన్నారు. గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వమే ఉచితంగా పాడి పశువులకు టీకాలు వేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పద్మ, ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా, గోపాల మిత్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

టీకాలు వేయించాలి

షాబాద్: పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని పశువైద్యాధికారులు ప్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని సంకెపల్లిగూడ, సాయిరెడ్డిగూడ గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలని వినతి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లల్లో మెనూ పాటించని వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డివిజన్ ఇన్‌చార్జి ఆకాశ్‌నాయక్, నగర అధ్యక్షుడు నరేశ్‌రాథోడ్ డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించడం లేదన్నారు. వార్డెన్లు స్థానికంగా ఉండాలనే నిబంధనలను పట్టించుకోకుండా పలువురు వార్డెన్లు పట్టణాల నుంచి రాకపోకలను కొనసాగిస్తున్నారన్నారు. జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వార్డెన్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొన్ని వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండడంతో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అద్దె భవనాలలో నడుస్తున్న హాస్టళ్లకు ప్రభుత్వం సొంత భవనాలను నిర్మించాలన్నారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మార్కెట్ యార్డు పనులు త్వరగా పూర్తిచేయాలి

కొత్తూరు: పట్టణంలో డ్వాక్రా భవనం సమీపంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభమైన మార్కెట్ నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. దీంతో కూరగాయాలు, చికెన్, మటన్ వ్యాపారులు రోడ్ల పక్కనే విక్రయిస్తుండడంతో తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తెలిపారు. అంతేగాకుండా ప్రతీ ఆదివారం సంతలోకి వాహనాలు వెళ్లని పరిస్థితి ఉంటుందన్నారు. మార్కెట్ నిర్మాణం పూర్తయితే వ్యాపారులు అక్కడ అన్ని సదుపాయాలతో వ్యాపారం నిర్వహించుకునే వీలుందని, ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఓటరు జాబితాలో తప్పులు సవరించాలి

ఆర్డీఓకు సీపీఎం నాయకుల వినతి

షాద్‌నగర్: ఓటరు జాబితాలో తప్పులను సవరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం షాద్‌నగర్ ఆర్డీఓ సరితకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనునాయక్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం గత నెలలో విడుదల చేసిన ఓటరు జాబితాలో చాలా తప్పులు ఉన్నాయన్నారు. ఒక గ్రామానికి సంబంధించిన ఓటర్లను మరో గ్రామ పంచాయతీలోకి మార్చారన్నారు. కొన్ని గ్రామాలకు సంబంధించిన ఓటరు జాబితాలు గందరగోళంగా ఉన్నాయన్నారు. అధికారులు వెంటనే ఓటరు సర్వే నిర్వహించి ఏ గ్రామంలో ఉన్న ఓటరు అదే గ్రామ పంచాయతీ పరిధిలోకి చేర్చాలని కోరారు. ఓటరు జాబితాలో తప్పులను సవరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, రాములు, పద్మారెడ్డి, బాబు పాల్గొన్నారు.

‘హామీల అమలులో కాంగ్రెస్ విఫలం’

నందిగామ: ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలు అని లేనిపోని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నా కూడా ఎందుకు అమలు చేయడం లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నోముల పద్మారెడ్డి ప్రశ్నించారు. మండల కేంద్రమైన నందిగామలో మంగళవారం అయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నా మాజీ సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించలేని దీనస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని విమర్శించారు. ఇప్పటివరకు పింఛన్లు పెంచలేదని, రూ.రెండు లక్షలు రుణమాఫీ సక్రమంగా కాలేదని, ఇందిరమ్మ ఇళ్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తే వారిని అక్రమంగా అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్‌లు ఆత్మపరిశీలన చేసుకోవాలని, పెండింగ్ బిల్లులు ఉన్నాయా లేదా.. ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమా కాదా.. అని ప్రశ్నించుకోవాలని సూచించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో దృష్టి సారించాలని హితవు పలికారు.

పారదర్శకంగా నిర్వహించాలి

ఎంపీడీఓ సంధ్య



మాట్లాడుతున్న అధికారి సంధ్య

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వేలో భాగంగా అధికారులకు కేటాయించిన బ్లాకులలో సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ సంధ్య పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర సర్వేకు సంబంధించిన అధికారులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో 28 గ్రామ పంచాయతీలకు గాను 28 పంచాయతీ అధికారులతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు, మీపీఓలు, ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్ అధికారులతో పాటు సీఆర్పీలు సర్వేలో పాల్గొననున్నట్లు సూచించారు. వీరందరూ వారి వారికి నిర్దేశించిన గ్రామాల్లో సమగ్ర సర్వేను పూర్తి చేయాలని ఆమె వివరించారు. 2011 సర్వే ప్రకారం 12,554 కుటుంబాలు ఉండేవని, ప్రాజెక్టుగా హెచ్‌హెచ్ఎల్ఎస్ 2024 వరకు దాదాపు 20,567 అంచనా ఈ సందర్భంగా నేటి నుంచి 6వ తేదీ వరకు నుంచి నవంబర్ 8 వరకు కుటుంబాల గుర్తింపు సర్వే జరుగుతుందని సూచించారు. దీనికి 28 గ్రామాల్లో రిజర్వ్‌తో కలుపుకొని 157 మంది ఎన్యూమరేటర్లు, 18 మంది సూపర్‌వైజర్లు వివరాలు సేకరిస్తారని తెలిపారు. కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని ఆమె కోరారు. సమావేశంలో మండల విద్యాధికారి వెంకటయ్య, ఐకేపీ అధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు సర్వం సిద్ధం

- నేటి నుంచి సమగ్ర కుటుంబ సర్వే
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేకు రంగం సిద్ధమైంది. ఈ సర్వేను విజయవంతం చేసేందుకు అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఇందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. బుధవారం నుంచి కుటుంబ సర్వే ప్రారంభం కానుంది.

70వేల ఇళ్లలో సర్వే

షాద్‌నగర్ నియోజకవర్గంలో కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాలతో పాటుగా షాద్‌నగర్, కొత్తూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. అయితే ఆరు మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో మొత్తం 70036 ఇళ్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రతి ఇంటికి అధికారులు వెళ్లి సర్వే వివరాలను సేకరించనున్నారు.

ఎన్యూమరేటర్లతో..

సర్వేను నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఉపాధ్యాయులు, ఉపాధి హామీ సిబ్బంది, మహిళా సంఘాల అధ్యక్షులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఈ సర్వేలో పాల్గొననున్నారు. అయితే వీరికి ఉన్నతాధికారులు ఇప్పటికే రెండు దఫాలుగా శిక్షణ తరగతులు నిర్వహించారు. సర్వేలో భాగంగా సిబ్బంది మూడురోజుల పాటు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ యజమాని పేరుతో కూడిన స్టిక్కర్లను ప్రతి ఇంటికి అతికించనున్నారు. అనంతరం ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి సమాచారాన్ని సేకరించి దరఖాస్తులో పొందుపరుస్తారు. అయితే ప్రతి ఎన్యూమరేటర్ రోజుకు సుమారు 10–15 ఇళ్లు సర్వే చేయనున్నారు. ప్రతి పది మంది ఎన్యూమరేటర్లను ఓ సూపర్‌వైజర్ పర్యవేక్షిస్తారు. సిబ్బంది ఎవరైనా గైర్హాజరతే వారి స్థానంలో విధులు నిర్వహించేందుకు అదనపు సిబ్బందిని అధికారులు అందుబాటులో ఉంచారు. నియోజకవర్గంలో మొత్తం 842 మంది ఎన్యూమరేటర్లు సర్వేలో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు

బ్లాకుల వారీగా..

120 నుంచి 150 కుటుంబాలకు ఒక బ్లాక్‌గా గుర్తించారు. అయితే సమగ్ర కుటుంబ సర్వే కోసం అధికారులు షాద్‌నగర్ డివిజన్‌ను 593 బ్లాక్‌లుగా విభజించారు. ఎన్యూమరేటర్లు ఫారాలపై సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. సర్వేలో భాగంగా ఒక్కో కుటుంబం నుంచి వివరాలు సేకరించేందుకు అరగంట సమయం పడుతుంది. ఈ సర్వేలో మొత్తం 75 ప్రశ్నలు అడగనున్నారు. ప్రజల నుంచి సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల తదితర అంశాలకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు.

సర్వేకు అందరూ సహకరించాలి

ఎంపీడీఓ హిమబిందు



చేవెళ్ల: మాట్లాడుతున్న ఎంపీడీఓ హిమబిందు, సీనియర్ అసిస్టెంట్ రవీందర్

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతన్న సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే బుధవారం నుంచి గ్రామాల్లో ప్రారంభమవుతుందని దీనికి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా సహకరించాలని ఎంపీడీఓ హిమబిందు కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌తో కలిసి ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేవెళ్ల మండలానికి సంబంధించి మొత్తం 146 బ్లాక్‌లు ఒక్కో బ్లాక్‌కు 150 నుంచి 175 ఇళ్లు సర్వేకు అప్పగిస్తున్నట్లు చెప్పారు. ఈ సర్వేలో మొత్తం మండలంలో 155 మంది ఎన్యూమరేటర్లు, 17 మంది సూపర్‌వైజర్లు ఉంటారని చెప్పారు. వీరందరికి ఇప్పటికే సర్వేకు సంబంధించిన శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు సర్వే కొనసాగుతుందన్నారు. సర్వేను పారదర్శకంగా చేయాలని ఆదేశించారు.

షాబాద్: ప్రభుత్వం చేపడుతున్న కుటుంబ సమగ్ర సర్వేకు ప్రజలందరూ సహకరించాలని షాబాద్ ఎంపీడీఓ అపర్ణ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో బుధవారం నుంచి నిర్వహించే కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ శారద తదితరులు పాల్గొన్నారు.